క్లుప్తంగా

ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా నారాయణ


నైనాల నారాయణ

నరసాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా నైనాల ఫిరోజ్ వెంకట నారాయణ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన మౌనిక మొగల్తూరు ఎంపీడీఓ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. నారాయణ ఇప్పటి వరకూ మొగల్తూరులో పని చేస్తూ నరసాపురం వచ్చారు.

వైభవంగా వెంకన్న విగ్రహ ప్రతిష్టాపన


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల ఆవరణలో భవనాల నిర్మాణం నిమిత్తం తవ్వుతుండగా 1965లో ఓ వేంకటేశ్వరస్వామి విగ్రహం లభ్యమైంది అయితే అప్పటి నుంచి అక్కడే విగ్రహానికి సాధారణంగా పూజలు నిర్వహించే వారు. ఇటీవల కళాశాల ఆవరణకు ఆనుకుని ఓ మందిరాన్ని నిర్మించారు. ఆ మందిరంలో శనివారం విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆబోతు మూగ రోదన


తీవ్రంగా గాయపడి బాధపడుతున్న ఆబోతు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు – పూలపల్లి బైపాస్‌రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగువన ఆబోతును శనివారం గుర్తు తెలియని తీవ్రంగా గాయపడింది. ఆ వాహనం ఆబోతును కొంత దూరం ఈడ్చుకెళ్లినట్లు ఆనవాళ్లున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆంబోతు మూగగా రోదించింది. ఆంబోతు కళ్లలోంచి నీరుధారకట్టిన ఆనవాళ్లు పడ్డాయి. విషయాన్ని స్థానికులు సాయంత్రం సమయంలో పూలపల్లి పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీను దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన స్పందించి, వెటర్నరీ డాక్టర్‌ని పిలిపించి వైద్యం చేయించారు. రాత్రికి పారిశుద్ధ్య కార్మికుడిని కాపలా ఉంచుతానని, ఆదివారం ఉదయం కోలుకుంటే వెటర్నరీ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తామని తెలిపారు.

రక్షణ గోడ నిర్మాణ ప్రాంతం పరిశీలన


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

నరసాపురం రూరల్: కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవాని లంకలో సముద్రపు కోత నివారణకు గోడ నిర్మించబోయే ప్రాంతాన్ని శనివారం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. దీనికి సంబంధించి డిలైట్ అనే సంస్థ రక్షణ గోడ నిర్మిస్తుందని, రక్షణ గోడ నిర్మాణానికి స్థానికులంతా సహకరించాలని ఆర్డీఓ గ్రామస్తులకు వివరించారు. రక్షణ గోడ నిర్మాణం వల్ల తీరం కోతకు గురి కాకుండా ఉంటుందని ఆర్డీఓ పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ తలారి రాజ రాజేశ్వరి, ఆర్ఐ ఎం.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

బోల్తా పడిన లారీ


హైవేపై బోల్తా పడిన లారీని పైకి లేపుతున్న దృశ్యం

ఉండి: స్థానిక బస్టాండ్ ఎదుట ఎన్నార్పీ అగ్రహారం పరిధిలోని రోడ్డు మలుపు వద్ద లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి నుంచి భీమవరం వైపుగా వెళుతున్న లారీని భీమవరం నుంచి ఉండి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో లారీ వెనుక చక్రాలు ఊడిపోయి బోల్తా పడింది. మరోవైపు కారు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో లారీ, కార్లలో ఉన్న ఏ ఒక్కరికీ ఎటువంటి గాయాలూ కాకపోవడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి కొన్ని వాహనాలు వాండ్రం రోడ్డు నుంచి భీమవారం వైపు మళ్లించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు.

విద్యార్థులను మోసం చేసిన కూటమి సర్కార్

ముదునూరి ప్రసాదరాజు


ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎగనామం పెట్టి కూటమి సర్కార్ రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థులను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఫీజుపోరు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పార్టీ నాయకులు, విద్యార్థులకు పిలుపు ఇచ్చారు. పార్టీ చేపట్టిన ఫీజు పోరు ఆందోళన కార్యక్రమం పోస్టర్‌ను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ పిల్లల అమ్మఒడి పథకాన్ని ఎగ్గొట్టిన కూటమి సర్కార్ కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా చేసిందన్నారు. కళాశాలల యాజమాన్యాల ఒత్తిళ్లతో తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులను కట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. విద్యార్థులకు అండగా 5న కలెక్టరేట్‌ల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, బర్రి శంకరం, గోరు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ములు మిస్సింగ్?

యలమంచిలి: మండలంలోని ఇలపకుర్రు పంచాయతీ సచివాలయ ఉద్యోగి పింఛన్ సొమ్ములు పంపిణీ చేయడానికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా శనివారం ఉదయం పాలకొల్లు–దొడ్డిపట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డులోని శిరగాలపల్లి – ఇలపకుర్రు మధ్యలో జారి పడిపోయింది. అయితే సదరు ఉద్యోగి బ్యాగ్ పడిపోయినట్లు గమనించలేదు. ఆ బ్యాగ్‌లో పింఛన్ సొమ్ములు రూ.2.20లక్షలు ఉన్నట్లు సమాచారం. ఈ నగదును శుక్రవారం బ్యాంక్ నుంచి విత్‌డ్రా చేసినట్లు సమాచారం. ఉద్యోగి స్వస్థలం యలమంచిలి శివారు బలుసువాడ. ఈ మేరకు సదరు ఉద్యోగి యలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ ఘటనపై పోలీసులను వివరణ అడగ్గా ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు


మార్టేరు పాలకొల్లు రోడ్డులో మార్టేరు వద్ద రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

పెనుమంట్ర: మార్టేరు–పాలకొల్లు రోడ్డులో మార్టేరు వద్ద ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. మార్టేరు సెంటర్ నుంచి కనకదుర్గ ఆలయం వరకు 700 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు నిర్మించి ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా రోడ్డు నిర్మించడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం– అశ్వారావుపేట రహదారిని పాలకొల్లు నుంచి మార్టేరు వరకు 11 కిలో మీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డును విస్తరించి పటిష్ఠ పరిచేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషితో రూ. 25 కోట్లు నిధులు మంజూరు చేసారు. దాంతో 2024 జనవరి 28న శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఈ రోడ్డు నిర్మాణానికి కవిటం వద్ద శంకుస్థాపన చేశారు. వెంటనే పనులు ప్రారంభించి నరసాపురం కాలువ ఒడ్డున రోడ్డు పొడవునా రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పూర్తి చేశారు. అయితే తదుపరి ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు నిర్మాణ పనులు ఆర్‌అండ్‌బీ అధికారులు నిలిపివేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పనులు ప్రారంభించిన అధికారులు మార్టేరు సెంటర్ నుంచి కనకదుర్గ గుడి వరకు 700 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ఈ రోడ్డుపై వాహనాలు రాకపోకలను 3 నెలల క్రితమే పునరుద్ధరించారు. అయితే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాలను నేటికి తొలగించకపోవడంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో? అని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పెనుమంట్ర ఎలక్ట్రికల్ ఏఈ జి.నాగరాజును వివరణ కోరగా విద్యుత్ స్తంభాల విషయాన్ని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.

ఉత్సాహంగా సాహిత్య సభ


ఎంఎస్ వాసును సత్కరిస్తున్న రసధుని సాహితీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: సాహితీ ప్రక్రియలో ఎన్నో అద్భుతమైన కావ్యాలను రచించిన గొప్ప కవి శ్రీనాథుడని వక్త గొర్తి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి అన్నారు. రసధుని ఆధ్వర్యంలో ఉల్లంపర్రు డా.సబితా జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన సాహిత్యసభలో శ్రీనాథుని చాటువులు, చమత్కారాలు అనే అంశంపై ఆయన ముఖ్యప్రసంగం చేశారు. మహా పండితుడు డిండిమభట్టు ఢంకాను పగులగొట్టి తన అహంకారాన్ని అణచిన గొప్ప సాహితీవేత్త అన్నారు. విలాసవంతమైన జీవితాన్ని గడపడంతో చివరి దశలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాంటిస్సోరీ విద్యా సంస్థల అధిపతి ఎంఎస్ వాసును రసధుని సాహితీ సంస్థ తరపున మాజీ ఎమ్మెల్యే డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ధి, యర్రంశెట్టి వెంకటరత్నం, వంగా నరసింహారావు, మద్దాల రాంప్రసాద్, సామవేదం వసంతలక్ష్మి, వేగేశ్న అరుణ, చేగొండి రంగారావు, ఆర్.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వైఎన్ కళాశాలలో జాతీయ సమైక్యత శిబిరం


శిబిరం ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తోన్న దృశ్యం

నరసాపురం: నరసాపురం వైఎన్ కళాశాలలో ఆదివారం నుంచి వారంరోజుల పాటు జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహిస్తున్నట్టు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ చెప్పారు. శనివారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ శిబిరంలో 12 రాష్ట్రాలకు చెందిన 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. 2023లో మొదటి సారి కళాశాలలో ఈ మెగా క్యాంపు జరిగిందని, ఒక ఏడాది విరామం తరువాత ఈ జాతీయ స్థాయి శిబిరం కళాశాలలో నిర్వహించడానికి నిర్ణయించారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు చింతా సోమేశ్వరి, సాదే యాకోబ్‌ల పర్యవేక్షణలో ఈ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వలంటీర్లకు అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. చివరి రోజు 9న పట్టణంలో వలంటీర్లతో ర్యాలీ ఉంటుందని వివరించారు. సమావేశంలో కళాశాల కోశాధికారి పోలిశెట్టి రఘురామారావు, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ అందే రామ సతీష్, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ డాక్టర్ గంధం రామకృష్ణ, కళాశాల సామాజిక సేవా విభాగం కన్వీనర్ బీఎస్ఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతలను వెలికితీయడం కోసం చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు వడ్డాది పాపయ్య–బాబు ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు కొసనా భాస్కరరావు అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ ఆవరణలో విద్యార్థులకు జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని సుమారు 30 పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు కొమ్ముల మురళీకృష్ణ ప్రారంభించారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డాది పాపయ్య–బాబు ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు కొసనా భాస్కరరావు, కార్యదర్శి చెల్లబోయిన రాము, వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణారావు (రాంభీ), నక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌లో 'మాదిగల పోరుబాట'


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నరసాపురం: ఎస్సీ వర్గకరణ జాప్యం లేకుండా అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న మందకృష్ణ మాదిగ లక్షల డప్పులు, వేల గొంతులు పేరుతో చేపట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం వైఎన్ కళాశాల సమీపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చెట్టెం జాన్సీరాణి, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పలివెల పైడియ్య మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణకు మార్గం ఏర్పడిందన్నారు. రిజర్వేషన్‌లు అన్ని కులాలకు సమానంగా దక్కాలనే ఉద్దేశంతో వర్గీవకరణకు మాదిగలు పోరాటం చేస్తున్నారని చెప్పారు. అయితే సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినా కూడా ఏబీసీడీ వర్గీకరణలో జాప్యం జరుగుతుందని అన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున మంద కృష్ణ మాదిగ ఆందోళన కార్యక్రమం చేపట్టారన్నారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున మాదిగ సోదరులు డప్పులతో తరలివెళ్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు గరికపూడి జేమ్స్, తెన్నేటి శేఖర్‌బాబు, సిర్రా చంద్రబాబు, మెరిపే మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ వాహనాల డ్రైవర్ల సమ్మె


మునిసిపల్ కార్యాలయంలో వాహనాలు నిలిపేసి సమ్మె చేస్తున్న తడిచెత్త, పొడిచెత్త వాహన డ్రైవర్లు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మునిసిపాల్టీలో తడిచెత్త, పొడిచెత్త విడివిడిగా సేకరించే వాహనాల డ్రైవర్లు వాహనాలు నిలిపి వేసి శనివారం సమ్మె నిర్వహించారు. పూణేకి చెందిన స్వయంభూ సంస్థ ప్రైవేట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 19 మంది డ్రైవర్లు పాలకొల్లు మునిసిపాల్టీలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించే వాహనాలపై పని చేస్తున్నారు. అయితే వీరికి గత మూడు నెలలుగా సంస్థ జీతాలు చెల్లించడం లేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గతేడాది నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని డ్రైవర్లు చెబుతున్నారు. ప్రతి నెలా 7వ తేదీలోగా జీతాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని, వారంలో ఒక రోజు సెలవు ఇవ్వాలని, పనికి తగిన వేతనం అమలు చేయాలని, మెడికల్ లీవ్ ఇవ్వాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలు తక్షణం పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని డ్రైవర్లు చెబుతున్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు

యలమంచిలి: పంచాయతీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే 'ఉప ముఖ్య మంత్రి గారు మా సమస్యలు పరిష్కరించండి' అనే పేరుతో వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపడతామని పంచాయితీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు చెప్పారు. యలమంచిలిలో శనివారం నిర్వహించినమండల పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల కోసం గత ప్రభుత్వాలు చేసిన జీఓలు గాని, హైకోర్టు ఉత్తర్వులు గాని ఇంత వరకు ఎక్కడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని పంచాయతీల్లో నెలల తరబడి వేతనాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. టెండర్‌తో నిమిత్తం లేకుండా పని చేయించి, వేతనాలు చెల్లించాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికీ టెండర్ కోసం జిల్లా అధికారులు డబ్బులు వసూలు చేయడం, టెండర్ పేరుతో కార్మికులను బెదిరించడం వంటి చర్యలు ఆగలేదని ఆయన వాపోయారు. కొన్ని గ్రామాలలో పంచాయితీ సర్పంచ్‌లు ఒకరైతే పెత్తనం వేరేవాళ్లు చేస్తున్నారని, వారి ఆగడాలతో పంచాయతీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. సమావేశంలో పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికులు శివరామ్, కిరణ్, రామకృష్ణ, రమణ, అబ్రహం, మాధవరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు అందరూ సహకరించాలి


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజకిశోర్

నరసాపురం రూరల్: పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ కె రాజకిషోర్ కోరారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొగల్తూరు మండలంలో 1,735 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,104 మంది పురుష ఓటర్లు కాగా 631 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. ఓటర్లందరికీ మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. రాజకీయ పార్టీలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పాటించాలి

ఆకివీడు : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ ఎన్ వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికలకు మండలంలో 2043 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 3న ఎన్నికలు ఉంటాయని, కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల సమావేశాలు, సభలు అనుమతి తీసుకోవడం తప్పనిసరని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పుప్పాల పండు, బొల్లా వెంకట్రావు, గంధం ఉమ, శింగులూరి చిట్టిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్, ఆర్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి శ్మశానవాటికను కాపాడాలి


మాట్లాడుతున్న పాత నవరసపురం గ్రామస్తులు

నరసాపురం రూరల్: మండలంలోని పాత నవరసపురంలో మత్స్యకారుల శ్మశానవాటికను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శ్మశానవాటిక సమీపంలో రొయ్యల చెరువు సాగు చేస్తూ క్రమక్రమంగా శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. అయితే తాజాగా కొబ్బరి చెట్లను తీసుకు వచ్చి శ్మశాన వాటిక స్థలంలో పాతారన్నారు. తరతరాలుగా తాము వినియోగించుకుంటున్న శ్మశాన వాటిక ఆక్రమణలకు గురువుతున్న విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కార్యక్రమంలో కోరాడ శ్రీనివాస్, తిరుమాని శంకర్, తిరుమాని లక్ష్మణరావు, తిరుమాని రమేష్, వాటాల సత్యనారాయణ, కారాడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో చర్చలు జరపాలి


మంత్రి రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

యలమంచిలి: ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్, కేటగిరైజేషన్ విషయంలో ఉద్యోగ సంఘాలతో చర్చించాలని సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకులు శనివారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలిసి వినతిపత్రం ఇచ్చారు. రేషనలైజేషన్, కేటగిరైజేషన్ విషయంలో ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుని అమలు చేస్తే గత 5 సంవత్సరాల నుంచి పేరుకుపోయిన సమస్యలతో పాటు కొత్త సమస్యలు ఏర్పడతాయని వారు మంత్రికి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జీఆర్ఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షుడు ఉమర్ ఆలీషా, పాలకొల్లు తాలూకా అధ్యక్షుడు సునీల్ కుమార్, నాయకులు నారాయణరాజు, సాయికాంత్, ప్రశాంత్, షబ్బాం, సత్య సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రోగికి మందుల వితరణ


బాలుడికి మందులు అందిస్తున్న వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు

పాలకొల్లు అర్బన్: పేద రోగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు ముందుకు రావాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు కోరారు. రావులపాలెం సమీపంలో లక్ష్మీపాలేనికి చెందిన చోడిశెట్టి హేమంత్ వినయ్ టైప్–1 సుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి ప్రతి నెలా రూ.7వేలు మందుల కోసం ఖర్చు చేస్తున్నారు. దీంతో స్పందించిన వాకర్స్‌క్లబ్ సభ్యులు రూ.22వేలు విలువైన మందులను బాలుడుకి శనివారం క్లబ్ కార్యాలయం వద్ద అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, జవ్వాజి కల్యాణ్, కర్రి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణికి పదవీ విరమణ సత్కారం


ఆచంట వేమవరంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణిని సత్కరిస్తున్న గ్రామస్తులు

పెనుగొండ: చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఘనత సమాజంలో ఉపాధ్యాయులకే దక్కుతుందని ఆచంట ఎంఈఓ ఉషారాణి అన్నారు. ఆచంట వేమవరంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నెక్కంటి కృష్ణవేణి పదవీ విరమణ సందర్భంగా కృష్ణవేణి దంపతులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో 42 సంవత్సరాలు పనిచేసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్, విశ్రాంత ఎంఈఓలు షేక్ సాగర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పోడూరు: పర్యావరణ పరిరక్షణకు వృక్షసంపదను పెంచాలని వద్దిపర్రు ఎంపీటీసీ మాజీ సభ్యుడు శీలం శ్రీనివాస్ అన్నారు. గోదావరి పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వద్దిపర్రు శివారు చింతగరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడడానికి వృక్ష సంపద దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్ సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు విప్పర్తి శారద, ఎస్ఎంసీ చైర్మన్ బి.వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.